క్లుప్తంగా

నేడు, రేపు జాబ్‌మేళా

కాచిగూడ: భారత్ సేవా సెంటర్ ఆధ్వర్యంలో ఈనెల 5, 6 తేదీల్లో మణికొండలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగే జాబ్ మేళాలో పాల్గొనే అభ్యర్థులకు ఎలాంటి రుసుము ఉండదని పూర్తి స్థాయిలో ఉచితంగా ఉంటుందని తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఎంబీఏ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని వివరించారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి శిక్షణ

కాచిగూడ: నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల కరాటే, సెల్ఫ్ డిఫెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జీవీఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కాచిగూడ అకాడమీలో ఆయన మాట్లాడుతూ.. ఆసక్తిగల యువతీ యువకులు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



కాచిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కాచిగూడ, రహమత్‌బాగ్ ప్రాంతానికి చెందిన వసంతకు మంజూరైన రూ.60 వేల చెక్కును మంగళవారం స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్‌తో కలిసి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మంత్రి సూచించారు. బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, సంతోష్, సూర్యప్రకాష్ తదితరులున్నారు.



అంబర్‌పేట: సీఎం రిలీఫ్ ఫండ్ పథకంతో పేదల వైద్యానికి భరోసా కల్పిస్తున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తిలక్‌నగర్‌కు చెందిన విష్ణుకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా మంజూరైన రూ.60 వేల చెక్కును గోల్నాక కార్పొరేటర్ దూసరిలావణ్యశ్రీనివాస్‌గౌడ్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానన్నారు.

ఉగాది పురస్కారాల ప్రదానం



చిక్కడపల్లి: బింగి మల్లీశ్వరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదానం ఘనంగా జరిగింది. మంగళవారం త్యాగరాయగాన సభలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎస్.వేణుగోపాలాచారి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాలు పాల్గొని అవార్డులను అందజేశారు. నర్తకి కృష్ణయుక్త, ముత్యాలు, విఠల్‌రావు, దామోదర్, ఉపేందర్, గోపాల్‌కు పురస్కారాలను ప్రదానం చేశారు.

అల్పజీవుల దాహార్తిని తీర్చే చర్యలు చేపట్టండి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వేసవి ఎండలు మండుతున్న తరుణంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో కార్యాలయాలపైన పిచ్చుకలు, పక్షుల వేసవి దాహార్తిని తీర్చేలా నీటి సదుపాయం కల్పించే ఉపయోగకరమైన చర్యలు తీసుకోవాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు రంగయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పర్యావరణ బలోపేతంలో జీవ వైవిధ్యం కీలకమైన విషయాన్ని గుర్తించి అల్పజీవులైన పిచ్చుకలు, పక్షులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, మానవ సమాజంపై ఉందన్నారు. వీధి కుక్కల దాహార్తిని తీర్చేందుకు జీహెచ్ఎంసీ యంత్రాంగం కృషి చేయాలన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయండి

కాచిగూడ: ఈ నెల 8 న హైదరాబాద్‌లో నిర్వహించే ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, కార్పొరేటర్లు బి.పద్మావెంకట్‌రెడ్డి, కన్నె ఉమా రమేష్ యాదవ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిమాన్వితం..
ప్రసన్నాంజనేయ క్షేత్రం

- భక్తుల పాలిట కొంగు బంగారమై విరాజిల్లుతున్న అంజనీసుతుడు
- దేవాలయానికి దాదాపు 600 ఏళ్ల చరిత్ర
- 6న హనుమాన్ జయంతి వేడుకలకు ముస్తాబు

కష్టాలు, ఆవేదనలు చుట్టుముట్టినప్పుడు మనోధైర్యం సన్నగిల్లుతుంది. ఎలా జీవించాలో అర్థంకాక భయం చుట్టుముడుతుంది. అలాంటి ఆపన్నులకు మనోధైర్యాన్ని అందిస్తూ.. కష్టాలకు ఎదురొడ్డి నిలిచే వీరత్వాన్ని అందిస్తున్నాడు హరాస్‌పెంటలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి. కష్టాలు తీర్చే దేవుడిగా పేరున్న అంజనీసుతుడిని దర్శించుకుని చేతులెత్తి మొక్కితే అన్ని క్లేశాలు దూరమవుతున్నాయని భక్తుల నమ్మకం. ఇదే నమ్మకంతో భక్తులు కోటి ఆశలతో ఆంజనేయస్వామి దర్శనానికి వస్తుంటారు. స్వామిని పూజిస్తే కొండంత ధైర్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం.



హరాస్‌పెంటలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం

కాచిగూడ: వరంగల్ జాతీయ రహదారిలో కాచిగూడ, హరాస్‌పెంట వద్ద ఆంజనేయస్వామి ఆలయానికి ప్రత్యేకత ఉంది. ఈ ఆలయంలో కొలువుదీరిన ఆంజనేయస్వామిని భక్తులు తమ ఇలవేల్పుగా కొలుచుకుంటారు. స్వామివారి మూలవిరాట్‌లకు విశిష్ట చరిత్రనే ఉంది. దాదాపు 600 ఏళ్ల క్రితం స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. కాలక్రమంగా ఈ ఆలయం దినదినాభివృద్ధి చెందింది. ఆ తర్వాత ఆలయంలో నవగ్రహాలు, శివలింగం, వివిధ దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేశారు. దేవాలయం హిందూ స్మశాన వాటిక ప్రబంధక సమితి ఆధ్వర్యంలో కొనసాగుతోంది.

- ప్రతి ఏడాది ఉగాది, శ్రీరామనవమి, హనుమాన్ జయంతితో పాటు పండుగల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తుంటారు. సత్యనారాయణ స్వామి వ్రతాలను ఇక్కడ వైభవంగా నిర్వహిస్తారు. ఆలయంలో ప్రతి మంగళ, శనివారాల్లో మన్యుసూక్త అభిషేకం, సింధూర పూజ, ఆకుపూజ, నవగ్రహ పూజలు జరుగుతాయి. ప్రస్తుతం ఆలయానికి చైర్మన్‌గా జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ ఎస్.గోపాల్‌రావు ఉన్నారు.



ప్రసన్నాంజనేయ స్వామి దర్శనం

స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు..

- ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ఉచిత మెడికల్ అండ్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసి రోజూ వందల సంఖ్యలో ప్రజలకు ఉచిత వైద్యసేవలు, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేస్తున్నారు. ఫిజియో థెరపీ వైద్యం, యోగా శిక్షణతో పాటు ప్రతీ నెలా కంటి వైద్య శిబిరం, దంత వైద్య శిబిరం, జనరల్ వైద్య శిబిరాలు నిర్వహిస్తూ.. పేదలకు వైద్య సేవలందిస్తున్నారు. మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఫ్యాషన్ డిజైనింగ్, బోటిక్, టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. మెహిందీలో ప్రత్యేక శిక్షణ తరగతులను కూడా ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.



ఎస్.గోపాల్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్

హనుమాన్ జయంతి వేడుకలు..

- 6వ తేదీన ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎంపీ డాక్టర్ వివేక్ వెంకటస్వామి, హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి తదితరులు హాజరు అవుతారని ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.గోపాల్‌రావు తెలిపారు.
- హనుమాన్ జయంతి సందర్భంగా సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, అలంకార సేవ, పుణ్యహావచనం, నవగ్రహపూజ, హనుమాన్ హోమం, పూర్ణాహుతి, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంతో పాటు భక్తులకు అన్నదాన ఏర్పాట్లను చేశామన్నారు. భక్తులు వేలాదిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి

కాచిగూడ: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారిణి మమత అనురాగ్‌శర్మ అన్నారు. నారాయణగూడలోని రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుతదేవి అధ్యక్షతన మంగళవారం కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అనేక రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి కలిగిన యువతకు ఉపాధి అవకాశాలకు కొదవలేదని మెరుగైన వేతనాలు తీసుకుంటూ స్వేచ్ఛగా పనిచేసే వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అకట్టుకున్నాయి.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రొఫెసర్ ముత్యంరెడ్డి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారిణి మమత అనురాగ్‌శర్మ

- ఇంగ్లిష్, గణితం, రసాయనశాస్త్రం, వాణిజ్యం, భాషలు, బయోటెక్, ఎంబీఏ తదితర విభాగాల్లో టాపర్‌లకు బంగారు పతకాలు, నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలతో పాటు పలు పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, ట్రోఫీలను అందజేశారు. మదూరిరెడ్డి 'బెస్ట్ స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు 2022 – 2023ను గెలుచుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.కవిత, కళాశాల కరస్పాండెంట్ ప్రొఫెసర్ సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, డాక్టర్ వై.జయంతి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు !

అంబర్‌పేట: ప్రమాదకరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఆర్టికల్చర్ విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం డివిజన్‌లో ప్రజల ఫిర్యాదు మేరకు చెన్నారెడ్డినగర్, బాపూనగర్ ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు పెరిగి విద్యుత్ వైర్లపై పడి ప్రమాదకరంగా మారాయి. వాటిని పరిశీలించిన కార్పొరేటర్ చెట్ల కొమ్మలను తొలగించాలని అధికారులను కోరారు. ఆర్టికల్చర్ అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో కాషాయ జెండాను ఎగరవేసేందుకు ప్రతి బీజేపీ కార్యకర్త సైనికుడిలా క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. మంగళవారం కవాడిగూడ డివిజన్ భాగ్యలక్ష్మినగర్‌కు చెందిన సిరిమల్లె ప్రేమ్‌కుమార్‌కు డాక్టర్ కె.లక్ష్మణ్ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా బీజేపీ ప్రత్యేక ఆహ్వానితులుగా నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీజేపీ కార్యకర్తలందరూ కష్టపడి పనిచేసి పార్టీ గెలుపునకు దోహదపడాలని సూచించారు. బీజేపీ ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ మల్లంపేట రమేష్‌రామ్, వెంకటేష్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్ బాబు, ప్రభాకర్ గంగపుత్ర, రాజుగౌడ్, రమేష్, దిలీప్‌యాదవ్, చంద్రయ్యగౌడ్ తదితరులున్నారు.

ఈనెల 6న వీర హనుమాన్ యాత్ర

కవాడిగూడ: హిందూ యువకుల ఐక్యత కోసం భజరంగ్‌దళ్ కృషి చేస్తోందని మహంకాళి జిల్లా సానంయోజక్ వెదిరె రాంరెడ్డి తెలిపారు. ఈనెల 6న వీరహనుమాన వీరయాత్ర సందర్భంగా హిందూశక్తి ప్రదర్శన మూడు లక్షల మంది యువకులతో నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కోఠిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చౌరస్తాలో లక్ష మందితో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించి రికార్డు నెలకొల్పుతామన్నారు. యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు ధర్మ వీరులను తయారు చేయడానికి ఈ ర్యాలీలు దోహదపడతాయన్నారు. స్వామిజీలతో పాటు భజరంగ్‌దళ్ జాతీయ కన్వీనర్ నీరజ్‌దేవనేరియా ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. నగరంలోని 139 ప్రాంతాల నుంచి భజరంగ్‌దళ్ కార్యకర్తలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీకి తరలివస్తారన్నారు. గౌలిగూడ రామ్‌మందిర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ ర్యాలీ ప్రారంభమవుతుందని సికింద్రాబాద్ తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు కొనసాగుతుందన్నారు. ఈ ర్యాలీలో హనుమాన్ భక్తులు అందరూ శాంతియుతంగా పాల్గొనాలని ఆయన కోరారు.

పార్కులో అభివృద్ధి పనుల పరిశీలన

కాచిగూడ: బర్కత్‌పుర హౌజింగ్ బోర్డు కాలనీ పార్కులో చేపట్టిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

కవాడిగూడ: భోలక్‌పూర్ డివిజన్‌లోని దామోదరం సంజీవయ్యనగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డీఎస్‌నగర్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగరావు, మహేష్, ఉపాధ్యక్షులు మల్లేష్, సీనియర్ నాయకుడు శంకర్‌గౌడ్‌లు ఎమ్మెల్యేకు తమ సమస్యలను విన్నవించారు. స్థానికంగా పేదలు అధికంగా నివసిస్తున్నారని వారికోసం కమ్యూనిటీహాల్‌ను నిర్మించి ప్రమాదకరంగా ఉన్న హుస్సేన్‌సాగర్ నాలా పరివాహక వాల్‌ను నిర్మించి బోరింగ్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరారు. అధ్వానంగా ఉన్న షాబాద్ ఫ్లోరింగ్‌ను పునర్నిర్మించాలని జనావాసాల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను తొలగించాలని వారు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, నాయకులు షరీఫ్, శ్రీనివాస్, హేమలత, ఎ.దాస్, విద్యావతి, సరోజ, వేణుక, ఎండీ దశరథ్, శ్యామల పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సాక్షి, సిటీబ్యూరో: మొట్టమొదటి తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ స్టేట్ చాంపియన్ షిప్, సౌత్ ఇండియా మాస్టర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌కు నగరం వేదిక కానుంది. ఏప్రిల్ 15న చిక్కడపల్లిలోని పోస్టల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన పోస్టర్‌ను క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఈ పోటీలను నిర్వహిస్తోంది. పురుషుల, మహిళల విభాగాల్లో 30 నుంచి 80 ఏళ్లున్న వారికి ఈ పోటీలు జరగనున్నాయి. పురుషుల విభాగంలో 9 వెయిట్ కేటగిరీ, మహిళల విభాగంలో 10 వెయిట్ కేటగిరీల్లోనూ ఈ పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. పోటీలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు సమాచారం. తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ ప్రదీప్‌కుమార్, ప్రెసిడెంట్ పీవీ నాయుడు, జనరల్ సెక్రటరీ శృతి, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బలం.. బలగం ప్రజలే

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలే కీలకమని పార్టీకి తనకు బలం, బలగం ప్రజలేనని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధుల విషయంలో వివక్ష చూపినా తెలంగాణ మాత్రం అభివృద్ధిలో ముందంజలో ఉందన్నారు. మంగళవారం కాచిగూడ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి కార్యక్రమాలతో దేశంలోనే ఆదర్శంగా నిలిపిన బీఆర్ఎస్ పార్టీ తిరిగి మూడోసారి కూడా అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేవలం 8 ఏళ్లలో దేశంలో తెలంగాణ 5వ స్థానంలో నిలిచిందన్నారు. బీఆర్ఎస్ అంటేనే 'బాధ్యత–రక్షణ, సమానత్వం' అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు దిడ్డి రాంబాబు, డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్ యాదవ్, కె.సదానంద్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, మన్నె శ్రీనివాస్ యాదవ్, పెంట రమేష్, శ్రీకాంత్, దేవిరెడ్డి విజితారెడ్డి, బి.కృష్ణాగౌడ్, రవీందర్‌యాదవ్, రాజేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు

అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం డిమాండ్

ముషీరాబాద్: ఎస్టీ జాబితాలో ఏ ఇతర కులాలను చేర్చవద్దని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్టీ జాబితాలో ఇతర కులాలను కలపొద్దని హైదరాబాద్ మల్లాపూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నిరసన తెలిపింది. అనంతరం సంఘం చైర్మన్ ఆంజనేయులు, జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు రమణ, హరిరామ్‌లు మాట్లాడుతూ.. ఇప్పటికే ఎస్టీలు విద్య, ఉద్యోగ, రాజకీయ, ఉపాధి రంగాల్లో చాలా వెనుకబడి ఉన్నారని ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేరిస్తే తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

- రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆయా ప్రభుత్వాలు ఎస్టీ జాబితాలో ఇతర కులాలను కలపాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జాతీయ ఎస్టీ కమిషన్, సెంట్రల్ రిజిస్టర్ జనరల్, గిరిజన కేంద్ర మంత్రిత్వశాఖ, సెంట్రల్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపార్మెంట్ ఇతర కులాలను ఆమోదించకుండా చూడాలని కోరారు. సంఘం ప్రతినిధులు శేషాద్రి నాగార్జున, యామినికుమార్, డాక్టర్ బాలాజీనాయక్, అయ్యానాయక్, వెంకటరమణ, బ్రహ్మయ్య, లాల్యనాయక్, ప్రసన్నకుమార్, శ్రీమన్నారాయణ, తాడన్న, తిరుపతిరావు, సత్యనారాయణ, సత్యారావు, మద్దిలేటి వెంకటేశ్వర్లు, గోపాల్ పాల్గొన్నారు.

బీజేఆర్, అంబేడ్కర్ ఉత్సవ కమిటీ వర్కింగ్ చైర్మన్‌గా జంగ శ్రీనివాస్

కవాడిగూడ: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్, డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి నిర్వహణ కమిటీ వర్కింగ్ చైర్మన్‌గా కవాడిగూడ డివిజన్ దోమలగూడకు చెందిన మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడిగా జంగ శ్రీనివాస్‌ను నియమించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నగర సీనియర్ నాయకులు ఎం.ఎన్. శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం భోలక్‌పూర్‌లో ఘనంగా సన్మానించి శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 75 ఏళ్ల దేశాన్ని పాలించిన పాలకులు దళితుల అభ్యున్నతి కోసం కృషి చేయలేదని రాష్ట్రం ఏర్పడిన తర్వాతే సీఎం కేసీఆర్ దళితుల ఆర్థిక బలోపేతానికి కృషి చేశారని కొనియాడారు. రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని 125 అడుగులతో నిర్మాణం, నూతన సచివాలయానికి నామకరణ చేసి ఆదర్శంగా నిలిచారన్నారు. ముప్పిడి నర్సింగ్‌రావు, న్యాయవాది సాయిలు, రజనీకాంత్‌గౌడ్, నవీన్‌రాజ్, లోకేష్, టింకు, శ్రావణ్, యేసురత్నం తదితరులు పాల్గొన్నారు.



జంగ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

శ్రమశక్తి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి: కార్మిక దినోత్సవం మే డేను పురస్కరించుకుని మే 1వ తేదీన రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వ కార్మికశాఖ నిర్వహించే ఉత్సవాల సందర్భంగా శ్రమశక్తి అవార్డులను ప్రదానం చేస్తుందని మేడే ఉత్సవాల నోడల్ అధికారి, రంగారెడ్డి జోన్ కార్మిక సంయుక్త కమిషనర్ ఎల్.చతుర్వేది ప్రకటించారు. కార్మికశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర కార్మిక కమిషనర్ ఆదేశాల మేరకు శ్రమశక్తి అవార్డుల కోసం కార్మికుల సంక్షేమానికి ఉత్తమ సేవలు అందిస్తున్న కార్మికసంఘాల నాయకులు, కార్మికుల నుంచి, బెస్ట్ మేనేజ్‌మెంట్ అవార్డుల కోసం ఫ్యాక్టరీలు, కంపెనీలు తదితర సంస్థల యాజమాన్యాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. జిల్లాలో ఉన్న కార్మిక సంఘాల నేతలు, కార్మికులు ఆయా జిల్లా డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయాల్లో ఏప్రిల్ 15వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలని కోరారు. కాగా.. ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో కూడా దరఖాస్తులను తీసుకుంటామన్నారు. డబ్ల్యుడబ్ల్యు.లేబర్.తెలంగాణ.జీవోవి.ఐఎన్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

రూ. 21 లక్షలతో అభివృద్ధి పనులు



లబ్ధిదారులకు పట్టాలు, చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ : రామకృష్ణ మఠం సమీపంలో రూ.21 లక్షలతో సివరేజ్ పైపులైన్ పనులను ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు కేటాయించి అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, బీఆర్ఎస్ నాయకులు జైసింహ, డివిజన్ అధ్యక్షులు వల్లాల శ్యామ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ రవీందర్, కల్వ గోపి, రమేష్, బీజేపీ నాయకులు రమేష్‌రామ్, వెంకటేష్, పరిమళ్, మహేంద్ర బాబు, ప్రభాకర్ గంగపుత్ర తదితరులున్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాలకు క్రమబద్ధీకరణ పేరుతో సొంత హక్కును కల్పించాలనే లక్ష్యంతో జీవో నెంబర్ 58,59 కింద పేదల నుంచి గతేడాది దరఖాస్తులను స్వీకరించింది. దీనిలో భాగంగా ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయ పరిధిలో జీవో నెంబర్ 58 కింద 226 మంది దరఖాస్తు చేసుకున్నారు.
- దరఖాస్తు చేసుకున్న వారిలో కేవలం ఇద్దరికే పట్టాలు రావడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. జీవో నెంబర్ 59 కింద 89 మంది దరఖాస్తు చేసుకోగా.. ఒక్కరికీ కూడా పట్టాల పంపిణీ జరగకపోవడం దురదృష్టకరమని పలువురు వాపోతున్నారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ...

- ముషీరాబాద్ మండలం తహసీల్దార్ కార్యాలయ పరిధిలో అర్హత ఉన్న లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్లు రవిచారి, సుప్రియనవీన్‌గౌడ్, రచనశ్రీలతో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం పేదింటి ఆడ పిల్లల వివాహం కోసం షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను ప్రవేశపెట్టి ఆ కుటుంబానికి పెద్దన్నగా నిలుస్తున్నారని కొనియాడారు.
- దేశంలోని రైతులు సంక్షేమంగా ఉండాలని కేసీఆర్ భావించి జాతీయ స్థాయిలో బీఆర్ఎస్ పార్టీని స్థాపించి రైతుల కోసం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టి ఆదుకుంటానని రైతులకు భరోసా కల్పిస్తున్నారన్నారు. ముషీరాబాద్ తహసీల్దార్ అయ్యప్ప, హిమాయత్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్ విష్ణు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ పనులను కార్పొరేటర్ రచనశ్రీతో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే